గ్రీన్ హంట్‌లో భాగమే కుమ్లి దారుణ హత్య

బి.డి.దమయంతి

నేడు దండకారణ్య ప్రజాయుద్ధంపై పాలక వర్గాలు తలపెట్టిన బహుముఖ దాడిలో భాగంగా పోలీసులు తమ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకుంటున్నారు. ప్రజా వ్యతిరేకులనూ, విప్లవోద్యమం మూలంగా ప్రయోజనాలు దెబ్బ తిన్న పెత్తందారులనే కాకుండా సాధారణ ప్రజలను సైతం నయానా భయానా ఇన్ఫార్మర్‌లుగా, ఎస్పీవోలుగా మలుచుకుంటున్నాయి. ఇలా ఇన్ఫార్మర్లుగా, ఎస్పీవోలుగా తయారైన వాళ్లు ప్రజలపై, ప్రజా సంగాల కార్యకర్తలపై, వృత్తి విప్లవకారులపై దాడులు చేస్తూ ప్రజా జీవితానికీ, విప్లవోద్యమానికీ నష్టం తలపెడుతున్నారు.

ఇటువంటి కోవకి చెందినవారే మాడ్ డివిజన్‌లోని కుతుల్ గ్రామానికి చెందిన కేశ ఖైర, మిచ్చ, పిర్రు, పరస్‌వేద గ్రామానికి చెందిన దల్లులు. వీళ్లు మొదటి నుండి లంపెన్ శక్తులు. ఇక్కడ పెంపొందుతున్న విప్లవోద్యమం అన్ని రకాల అరాచకాలకు అడ్డుకట్ట వేయడంతో వీళు కుక్కిన పేన్ల లాగా మారిపోయారు. 2005లో పశ్చిమ బస్తర్‌లో మొదలైన సల్వాజుడుంలో ఇటువంటి వాళ్లందరినీ పోలీసులు చేరదీసి తమ పనిముట్లుగా మార్చుకున్నట్టుగానే వీళ్లను కూడా పోలీసులు తమ నెట్‌వర్క్‌లో భాగం చేసుకున్నారు. 2006 నుండి వీరు నారాయణ్‌పూర్‌లో వుంటూ విప్లవ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. దీనికి పరాకాష్టగా 2010 ఫిబ్రవరి 10న వీరు కుమిలిని అత్యాచారం చేసి హత్య చేశారు. కుమిలి మాడ్ డివిజన్‌లోని కుతుల్ ఏరియా జనతన సర్కార్‌లో వ్యవసాయ శాఖలో వృత్తి విప్లవకారిణిగా పని చేస్తోంది. నిండా ఇరవై ఏళ్లయినా లేని ఈ అమ్మాయి ఫిబ్రవరి 10న దుమ్‌నార్ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రానికి వంటరిగా వెళ్లి పనిచేసుకుంటూ వుండగా పై నల్గురి ముఠా దాడి చేసి సమీపంలోని అడవిలోకి ఆమెను ఎత్తుకెళ్లి పాశవికంగా అత్యాచారానికి పాల్పడ్డారు. అక్కడి నుండి మరొక చోటికి తీసికెళ్లి ఆమెను దారుణంగా చంపేశారు.

వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన కుమిలి తిరిగి రాకపోవడంతో ఆమె కోసం సహచరులూ, ప్రజలు ఆందోళనగా వెతికారు. ఫిబ్రవరి 13న ఆమె మృతదేహాన్ని గ్రామస్తులు కనుక్కోగలిగారు. ఆమె మృతదేహాన్ని చూసిన వాళ్లంతా దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఈ హత్యను ఎంత బీభత్సంగా చేశారంటే ఆమె మృతదేహం నగ్నంగా పడివుంది. గొంతును పూర్తిగా కోసివేశారు. నాలుకను తెగ్గోసి తమతో పాటు తీస్కెళ్లారు– తాము చేసిన హత్యకు తమ పోలీసు బాస్‌ల దగ్గర సాక్ష్యంగా ఆ నాలుకను చూపించి కిరాయిని పొందడం కోసం అలా చేశారు. అంతేకాదు ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం కోసం కూడా వాళ్లు అంత క్రూరత్వానికి పాల్పడ్డారు. క్రూరుడైన ఇంటలిజెన్స్ పోలీసు అధికారి ఫ్రాన్సిస్ ఇందువార్‌ను విప్లవకారులు గొంతు కోసి చంపినప్పుడు పాలకవర్గాలు తమ చెప్పుచేతుల్లో వుండే ప్రసార మాధ్యమాల ద్వారా విపరీతమైన ప్రచారం చేశాయి. కానీ ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఒక ఆదివాసీ అమ్మాయిని అవే పాలకవర్గాల పెంపుడు కుక్కలు అత్యంత ఘోరంగా సామూహిక అత్యాచారం చేసి, గొంతు, నాలుక తెగ్గోసి చంపిన విషయాన్ని పార్టీ బహిర్గత పర్చినప్పటికీ ఏ ప్రసార మాధ్యమాలు పట్టించుకోలేదు. 'దేశ అంతర్గత భద్రతకు పెను ప్రమాదం'గా వున్న పార్టీకి చెందినంత మాత్రాన ఒక ఆదివాసీ యువతి అంత ఘోరమైన మరణానికి అర్హురాలు అవుతుందా?

కుమిలి దారుణ హత్య ప్రజల్లో పాలక వర్గాల పట్లా, వాటి 'కాపలా కుక్కల' పట్లా తీవ్ర ఆగ్రహాన్ని కల్గించింది. తమ కోసం ప్రాణాలిచ్చిన ఆ పీడిత ప్రజల ప్రియతమ పుత్రిక మృతదేహాన్ని ఆమె స్వగ్రామం పైవేర్‌కు తీసుకెళ్లి, విప్లవ సాంప్రదాయాలతో అంత్యక్రియలు చేశారు. ఆ యువ విప్లవకారిణి త్యాగాన్ని వృధా పోనియ్యమని శపథం చేశారు.

ఇంతకూ కుమిలి హంతకులెవరన్న విషయం ఎలా తెలిసింది? ఆమె హత్యకు గురయిందంటేనే కచ్చితంగా అది పోలీసుల, లేదా ఎస్పీవోల పనేనని ప్రజలకు అర్థం కావడం పెద్ద కష్టం కాదు. లేకుంటే ఆమెను హత్య చేసే తలంపు ఎవరికుంటుంది? ఆమె హత్య జరిగిన కొద్ది రోజులకు పిర్రు అనే ఎస్పీవోను మిలీషియా అరెస్ట్ చేసింది. ఆ ద్రోహిని ఇంటరాగేషన్ చేసినపుడు ఈ ఘోరానికి పాల్పడ్డ ప్రజా ద్రోహులు ఎవరో స్పష్టంగా తెల్సిపోయింది.

చిన్న వయసులోనే విప్లవానికి జీవితాన్ని అంకితం చేసి ప్రజా ద్రోహులకు కంటిలో నలుసుగా మారిన కుమిలిది మాడ్ డివిజన్‌లోని కుతుల్ ఏరియా పైవేరు గ్రామం. బాల్యంలోనే కన్నతల్లిని కోల్పోయిన ఆమె పినతల్లి సంరక్షణలో పెరిగింది. విప్లవోద్యమ ప్రభావం బలంగా వున్న ప్రాంతం కావడంతో సహజంగానే ఆమె యుక్తవయసు రాగానే 2007లో విప్లవోద్యమంలోకి భర్తీ అయింది. ఒక సంవత్సర కాలం పాటు ఆమె కుతుల్ ఏరియాలోనే ఎల్‌జిఎస్‌లో సభ్యురాలిగా పనిచేసింది. పట్టుదలతో తక్కువ కాలంలోనే చదవడం, రాయడం నేర్చుకుంది.

2008లో ఆమె జనతన సర్కార్‌లోని వ్యవసాయ శాఖలో సభ్యురాలయింది. అలా ప్రజల ఆర్థిక విధానాన్ని విప్లవీకరించే కృషిలో ఆమె క్రియాశీల భాగస్వామి అయింది. అందుకే ప్రత్యామ్నాయ వ్యవస్థను సహించలేని పాలక వర్గాలకు శత్రువయింది. ఫలితంగా వాళ్ల చేతుల్లో దారుణహత్యకు గురయింది.

కుమిలి నేడు భౌతికంగా లేదు. ఆమె మరణించి పీడిత ప్రజల ఆగ్రహంగా మారింది. ఆ ఆగ్రహం నుండి దోపిడీ పాలక వర్గాలను కాపాడే శక్తి ఎవరికుంది?